చెత్త రవాణా.. తప్పని హైరానా

● మూలన పడుతున్న ఆటో ట్రాలీలు

బెల్లంపల్లి పాత మున్సిపల్ కార్యాలయంలో మూలన పడ్డ ఆటో ట్రాలీలు

న్యూస్‌టుడే, బెల్లంపల్లి

బెల్లంపల్లి పురపాలికలో చెత్త రవాణా ఇబ్బందికరంగా కొనసాగుతోంది. చోదకులు లేకపోవడంతో ఆటో ట్రాలీలు ముందుకు కదలడం లేదు. అవి మున్సిపాలిటీకి సరిపడినన్ని లేకపోవడంతో చెత్తంతా సకాలంలో తరలించడం లేదు. దీంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. వార్డులన్నీ కంపు కొడుతున్నాయి. వర్షాకాలం కావడంతో చెత్త తరలింపు సిబ్బందికి కష్టతరంగా మారింది.

● తడి, పొడి చెత్త కోసం ప్లాస్టిక్ కుండీలు పంపిణీ చేసినప్పటికీ వాటిని స్థానికులు వినియోగించడం లేదు. చెత్తంతా కలిపి ట్రాలీల్లో వేస్తున్నారు. ఆ చెత్తను నేరుగా తీసుకెళ్లి డంపింగ్ యార్డులో వేస్తున్నారు. అక్కడ ఆ చెత్తకు మంటలు అంటుకోవడం పరిపాటిగా మారింది.

● గతంలో బెల్లంపల్లి బల్దియాలో దాదాపు 17 వార్డుల్లో సింగరేణి యాజమాన్యం పారిశుద్ధ్య పనులు చేపట్టేది. సింగరేణి క్వార్టర్లను ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు మున్సిపాలిటీ చేపడుతోంది.

నడిచేవి 13 వాహనాలే

బెల్లంపల్లి బల్దియాకు 2020వ సంవత్సరంలో 23 ఆటో ట్రాలీలను రూ.1.30 కోట్లతో అధికారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 13 ఆటో ట్రాలీలను నడిపిస్తున్నారు. ఒక ట్రాలీకి రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోవడంతో ఆర్టీఏ అధికారులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 9 ఆటో ట్రాలీలు పాత మున్సిపల్ కార్యాలయంలో మూలన పడ్డాయి. వీటి విడిభాగాలు ఇప్పటికే దొంగల పాలయ్యాయి. దీంతో వీటిని షెడ్డులో భద్రపరిచారు. ట్రాలీల టైర్లు, బ్యాటరీలు ఇతర విడిభాగాలు లేవు. మరోవైపు 13 మంది డ్రైవర్లు మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 10 మంది కావాల్సి ఉంది.

బల్దియాలో 24 టన్నుల చెత్త

బెల్లంపల్లి పురపాలికలో ప్రతి రోజు 24 టన్నుల చెత్త పోగవుతోంది. ఒక్కో ట్రాలీలో 700 నుంచి 800 కిలోల చెత్తను తరలిస్తున్నారు. చెత్తను తరలించడానికి ప్రతిరోజు ఒక్కో ట్రాలీ మూడు ట్రిప్పులు కొట్టాల్సి ఉంటుంది. అన్ని వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తే ఒక్కో ట్రిప్పుతోనే చెత్తను తరలించవచ్చు. [illegible] చెత్తను కుప్పలుగా పోయడంతో తడి, పొడి చెత్త వేరు చేయడం కష్టతరంగా మారింది. శివారు వార్డులైన అంబేడ్కర్‌నగర్, రవీంద్రనగర్, షంషీర్‌నగర్, సుబ్బరావుపల్లిల్లో నామమాత్రంగానే చెత్తను సేకరిస్తున్నారు. డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియను ఇంకా ప్రారంభించ లేదు.

ఐజా కళాశాల విద్యుత్తు బిల్లు @ రూ. 12,18,927



సాధారణ విద్యుత్తు వినియోగదారుడు విద్యుత్తు బిల్లు చెల్లించడంలో కాస్త ఆలస్యమైనా అధికారులు సరఫరాను నిలిపివేస్తారు. కానీ నగరంలోని ఐజా కళాశాల మాత్రం అందుకు మినహాయింపు ఉన్నట్లు కనిపిస్తోంది. ఒకటి, రెండు రోజులు కాదు.. రెండేళ్ల నుంచి చెల్లించకపోయినా సంస్థ నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో సామాన్యుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కళాశాల యాజమాన్యం చివరగా 2024లో చెల్లించింది. ఆ తర్వాత ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా చెల్లించలేదు. ఈ రెండేళ్లలో రూ. 12,18,927 బకాయి పడగా.. అధికారులు అడిగితే ఇక్కడ [illegible] స్ట్రాంగ్‌రూం ఉందని సమాధానం ఇస్తున్నారని తెలుపుతున్నారు. ఈవీఎంలు భద్రపరిచారని, ఇదే సాకుగా చూపుతూ రూ.లక్షల బిల్లును చెల్లించడం వాయిదా వేస్తున్నారు. భారీ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నా చర్యలు తీసుకోకపోవడంపై విద్యుత్తు సంస్థపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. - న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ

పాఠశాల స్థలం.. కొట్టేయాలని పన్నాగం

● అక్రమంగా అమ్మడానికి యజమానుల కుట్ర

న్యూస్‌టుడే, మంచిర్యాల పట్టణం

రేకుల కంచె ఏర్పాటు చేసారిలా..

మంచిర్యాల నగరంలోని హైటెక్‌సిటీ వెంచర్‌లో లే అవుట్ నిబంధనల ప్రకారం పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని అక్రమంగా ప్లాట్లుగా మార్చి అమ్ముకునేందుకు యత్నించడం వివాదాస్పదంగా మారుతోంది.

2006లో కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు వివిధ సర్వే నంబర్లలో దాదాపు 68.25 ఎకరాల స్థలానికి మున్సిపల్ అనుమతి తీసుకుని లే అవుట్ వెంచర్ ఏర్పాటు చేశారు. అప్పుడు నిబంధనల ప్రకారం 30 శాతం స్థలం రోడ్లకు, పార్కుల నిర్మాణానికి 10 శాతం స్థలాన్ని స్థిరాస్తి వ్యాపారులు కేటాయించడంతో అధికారులు ఆ పార్కు స్థలం చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. వెంచర్ ఏర్పాటు చేసిన యజమానులు అప్పట్లో ప్లాట్లు కొనుగోలుదారుల పిల్లల సౌలభ్యం కోసం పాఠశాల భవనం నిర్మించడానికి లే అవుట్ ఎల్.పి.నం.58/2006 ప్రకారం ఒక ఎకరం స్థలం అదనంగా కేటాయించారు. అప్పుడు ఆ స్థలంలో పాఠశాల నిర్మించకుండా అక్రమంగా ప్లాట్లు చేసి అమ్ముకునేందుకు యత్నించడంపై ఆ కాలనీవాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

☛ హైటెక్‌సిటీలో పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ముందు వెంచర్ చేసిన యజమానులు పాఠశాల నిర్మాణం కోసం వేరే వ్యక్తులకు అమ్మారు. ప్రస్తుతం ఆ యజమానులు ఆ స్థలంలో పాఠశాల నిర్మించకుండా అక్రమంగా 17 ప్లాట్లు చేసి అమ్మకాలు చేస్తున్నారని తెలిసింది. గజం భూమిని రూ.30 వేల చొప్పున రూ.10 కోట్లకు అమ్మకానికి యత్నిస్తున్నారని సమాచారం. పాఠశాల స్థలం అక్రమంగా అమ్మడానికి [illegible] తరం వ్యక్తం చేసినందుకు హైటెక్ సిటీ కాలనీ సంక్షేమ సంఘం కమిటీని రద్దు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

తాజా పరిస్థితి: హైటెక్‌సిటీలో పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని ఆ వెంచర్ పెట్టిన యజమానులే అందులో పాఠశాల ఏర్పాటు చేయడానికి, లేదా పాఠశాల నిర్మాణం కోసం ఇతరులకు ఆ స్థలం లీజ్‌కు ఇచ్చుకునే అవకాశం ఉంది. ఆ స్థలాన్ని యజమానులు అమ్మాలనుకుంటే అందులో పాఠశాల భవనం నిర్మించేవారికి మాత్రమే అమ్మాల్సి ఉంటుందని నగరపాలక అధికారులు తెలిపారు. కానీ ఆ స్థలం చుట్టూ రేకుల కంచె ఏర్పాటు చేసి అక్రమంగా ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేస్తున్నారు. ఆ ప్లాట్లు కొనుగోలు చేస్తే నగరపాలక సంస్థ నుంచి ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వబోమని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేయరని వారు తెలిపారు.

నోటీసులు జారీ చేశాం

హైటెక్‌సిటీ లే అవుట్ వెంచర్‌లో పాఠశాలకు కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వం. పాఠశాల స్థలం చుట్టూ వేసిన రేకుల కంచె తొలగించాలని ఆ భూమి యజమానులకు నోటీసు ఇచ్చాం. మూడు రోజుల్లో తొలగించకుంటే నగరపాలక సంస్థ ద్వారా మేమే తొలగిస్తాం.

- అన్వేష్, కమిషనర్, నగరపాలక సంస్థ

ఒకే భవనంలో మూడు కార్యాలయాలు

జైతుగూడలో దిశ ఆదర్శ పాఠశాల వరండాలో కూర్చున్న అంగన్‌వాడీ చిన్నారులు

న్యూస్‌టుడే, దండేపల్లి గ్రామీణం

దండేపల్లి మండలం రాజుగూడ పంచాయతీ పరిధిలోని జైతుగూడ దిశ ఆదర్శ పాఠశాల భవనంలో పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్నాయి. మూడు ఒకే చోట ఉండటంతో విద్యార్థులతో పాటు పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు రెండు గదులు ఉండగా ఒక దాంట్లో పాఠశాల విద్యార్థులు, మరో దాంట్లో రాజుగూడ పంచాయతీ కార్యాలయం నిర్వహిస్తున్నారు. వరండాలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తోంది. పంచాయతీ కార్యాలయ సమావేశాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంగన్‌వాడీ చిన్నారులకు ఇచ్చే పౌష్టికాహారం, ఇతర సామగ్రి భద్రపరిచేందుకు స్థలం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

☛ జైతుగూడలో ఏడాది కిందట ఉపాధి నిధులతో నూతన పంచాయతీ భవనాన్ని నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

గాంధారి వనం.. నిర్వహణ అధ్వానం

న్యూస్‌టుడే, రామకృష్ణాపూర్

జిల్లా ప్రజలకు ఆహ్లాదం పంచడానికి క్యాతనపల్లి పురపరిధిలోని బొక్కలగుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన గాంధారి వనం నిర్లక్ష్యానికి గురవుతోంది. 134 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన ఈ వనం ఉమ్మడి జిల్లాలోనే ఎంతో ప్రాచుర్యం పొందింది. సింగరేణి ప్రాంత ప్రజలకు, వాకర్లకు ఆహ్లాదాన్ని పంచే ఈ వనంలో పర్యవేక్షణ కొరవడింది.

ఏడాది క్రితం రూ.5 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. నడకదారుల్లో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరగడంతో ఉదయం వాకింగ్ చేసే వారికి, పర్యాటకులకు ఇబ్బందులు తప్పడం లేదు. వనం లోపలికి వెళ్లేందుకు ప్రవేశ రుసుం వసూలు చేస్తున్నారు.. కానీ సౌకర్యాలు కల్పించడం లేదని సందర్శకులు ఆరోపిస్తున్నారు.

గాంధారి వనం ఎదుట నిలిచిన నీరు

గతంలో రూ.3 కోట్లతో పిల్లల పార్కు, ప్రకృతి వనం, జింకల పునరావాస కేంద్రం వేర్వేరుగా ఏర్పాటు చేశారు. సమీపంలోనే మైసమ్మ ఆలయం ఉండటంతో భక్తులు వస్తుంటారు. వారికి ఆహ్లాదం కరవైంది. గాంధారి వనంలో ఉన్న చెరువులో గతంలో బోటింగ్ సదుపాయం కల్పించారు. దీంతో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండేది.

బోటింగ్ నిలిపివేత

కాలక్రమేణా బోటింగ్ సదుపాయం నిలిపివేయడంతో వారి సంఖ్య తగ్గింది. చెరువు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. వనం ఎదుటే నీరు నిలిచి పరిసరాలు అధ్వానంగా ఉన్నా కనీసం చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల రూ.లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు ఊడిపోతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని సందర్శకులు ఆరోపిస్తున్నారు.

నడకదారిని కమ్మేసిన చెట్ల పొదలు, ఇబ్బందులు పడుతున్న వాకర్లు

బయో పేరిట మాయోపాయం

● దర్జాగా అక్రమ దందా

ఈటీవీ–ఆదిలాబాద్

ఉమ్మడి జిల్లాలో పంటలకు వినియోగించే జీవ రసాయనాల(బయోమందుల) విక్రయం పేరిట రూ.కోట్ల అక్రమ దందా దర్జాగా నడుస్తోంది. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రసాయన మందులతోనే గుర్తుపట్టనట్లుగా కొంత మార్పిడి చేసి జీవ/సేంద్రియ మందులని నమ్మించి విక్రయించే ప్రయత్నం జరుగుతోంది.

ఆదిలాబాద్, ఉట్నూరు, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, భైంసా, మంచిర్యాల, జైపూర్, చెన్నూరు, లక్షెట్టిపేట, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, జైనూర్ కేంద్రాలుగా విచ్చలవిడిగా జరుగుతున్న నకిలీ రసాయనాల అమ్మకాల వెనక కొన్ని కంపెనీల ప్రతినిధులు, డీలర్లు, మరి కొంతమంది వ్యాపారులతో కలిసి ఏర్పడిన ముఠాల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది.

☛ నిబంధనల ప్రకారమైతే తెలంగాణ ఎరువుల నియంత్రణ పరిధిలోకి వచ్చిన బయో ఫర్టిలైజర్ చట్టానికి లోబడి జీవ రసాయనాలను విక్రయించాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది.

☛ తయారు చేసిన కంపెనీల వివరాలు, వాటి వినియోగంతో నేల విషపూరితం కాదనీ, మనుషులు, ఇతర జంతుజాలానికి ప్రమాదం లేదని నిరూపించేలా వ్యవసాయ విశ్వవిద్యాలయాల ల్యాబ్‌ల నివేదికలను అందుబాటులో ఉండాలి.

☛ ఇవేం లేకుండానే కొంతమంది వ్యాపారులు, కంపెనీల ప్రతినిధులు కలిసి మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చే మందులతోపాటు స్థానికంగానే తయారు చేసేవి మరికొన్నింటి కలిపి రైతులకు విక్రయించే దందా నడుస్తోంది.

● రెండు నెలల కిందట ఆదిలాబాద్‌లో ఓ వ్యక్తి నకిలీ బీటీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి సమీపంలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌లోని గోదాంలో తనిఖీ చేశారు.

కరవైన నిఘా

నకిలీవిత్తనాలతో పాటు అనుమతి లేని జీవరసాయన ఎరువులు ఉన్నట్లు తేలింది.

● నకిలీ విత్తనాలు విక్రయించిన ప్రతి ఒక్కరికీ నకిలీ జీవ రసాయనాలతో సంబంధం ఉన్నట్లు పోలీసుల దృష్టికి వెళ్లింది.

● టాస్క్‌ఫోర్స్ కమిటీల తనిఖీలు నామమాత్రం కావటంతో ఆశించిన ప్రగతి కనిపించటం లేదు. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ దుకాణాల్లో రోజూ రూ.లక్షల్లో జీవ రసాయన వ్యాపారం సాగుతోంది. 'మామూలు'గా తీసుకుంటున్న వ్యవసాయ శాఖ చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

● ఈ బయో ఎరువులు వాడగానే రెండు, మూడు రోజుల పాటు మొక్క ఆకుపచ్చగా కనిపిస్తుంది. కాండం పెరిగినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత మళ్లీ యథావిధిగానే ఉంటుంది.

కావాల్సిన టిక్కర్స్

బయో మందుల సీసాలపై దుకాణాదారులు కావాల్సిన పేరుతో టిక్కర్స్(లేబుల్స్)ను అతికించి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. రూ.300కు తయారు చేసే ఒక లీటర్ సీసాను ఏకంగా రూ.3 వేల వరకు విక్రయిస్తున్నారు. దీని వెనక అక్రమార్కుల ఎత్తుగడ ఎలా ఉందో వెల్లడవుతోంది. మరి కొంతమంది ఆన్‌లైన్‌లో రూ 15 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రభుత్వ అనుమతి ఉందంటూ వెల్లడించేలా నకిలీ ల్యాబ్ పత్రాలు కొనుగోళ్లు చేసుకుంటున్నట్లు తెలిసింది.

బాలల రక్షణకు 1098 హెల్ప్‌లైన్

ముక్కోసం

ప్రస్తుత సమాజంలో పిల్లలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. పోక్సో కేసులు నమోదవుతున్నాయి. బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉంటున్నారు. ఇలా అనేక రకాలుగా బాలలు స్వేచ్ఛగా జీవించే హక్కును కోల్పోతున్నారు. ఇలాంటి తరుణంలో బాలలకు రక్షణ కల్పించాలని భారత ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేకమైన 1098 హెల్ప్‌లైన్ నంబరును అందుబాటులో ఉంచింది. ఇది పూర్తిగా ఉచితం. 24 గంటలు పని చేస్తుంది. కాల్ చేసిన వారి పేర్లు అత్యంత గోప్యంగా ఉంచుతారు.

● కాల్ అందిన 60 నిమిషాల లోపు 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది చేరుకుంటారు.

● పోలీసులు, బాలల సంక్షేమ సమితి ప్రతినిధుల సహాయంతో పిల్లలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు.

● అవసరమైతే వైద్యం, వసతి కల్పిస్తారు. కౌన్సెలింగ్ నిర్వహించి పునరావాసం కల్పిస్తారు.

ఎలా పని చేస్తుందంటే

- హోటళ్లు, దుకాణాలు, ఇళ్లల్లో పనులు చేస్తున్న పిల్లలను రక్షించడానికి..
- 18 ఏళ్లలోపు బాలికలకు బలవంతంగా పెళ్లిళ్లు చేస్తుంటే ఆపడానికి
- ఇళ్లు, బడుల్లో, బయట లైంగిక వేధింపులు, శారీరక హింసకు గురవుతున్న పిల్లలకు..
- తల్లిదండ్రులు లేనివారు, ఇళ్లు వదిలి వచ్చేసినవారు, రహదారులపై యాచక వృత్తి చేసే బాలల కోసం..
- అక్రమ రవాణాకు, విక్రయానికి గురవుతున్న పిల్లలకు రక్షణ కల్పిస్తుంది.

- న్యూస్‌టుడే, భుక్తాపూర్

కాలువలో తుంగ.. నీరు పారక బెంగ

నీల్వాయి జలాశయం పరిధిలోని కుడి కాలువ తుంగతో నిండింది. ఈ కాలువ ద్వారా వేమనపల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు కోటపల్లి మండలంలోని వెంచపల్లి, సూపాక వరకు సుమారు 4 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యం ఉండగా నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. కాలువ కనిపించలేనంతగా అనేక చోట్ల తుంగ కమ్మేయడంతో అధికారులు నీటిని విడుదల చేసినా ప్రవహించలేని పరిస్థితి తలెత్తింది. కాలువ నిర్మాణంతో సాగునీరందుతుందని ఆశపడ్డ రైతులకు అధికారుల నిర్లక్ష్యంతో నిరాశ ఎదురవుతోంది.

- న్యూస్‌టుడే, కోటపల్లి

విద్యార్థుల సామర్థ్యాల పెంపుపై దృష్టి

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందిస్తూ అభ్యసన సామర్థ్యాల పెంపుపై దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు తదితర అంశాలపై ప్రత్యేక యాప్ ఏర్పాటు చేసి వారాంతపు నివేదికలు సేకరించనున్నట్లు తెలిపారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తమ పరిధిలోని పాఠశాలలను నిత్యం పర్యవేక్షిస్తూ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో ఇబ్బందులుంటే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. టీఎల్ఎంలతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలన్నారు. అదనపు కలెక్టర్, ఇన్‌ఛార్జి డీఈవో పి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ప్రయోగాలు చేసి.. అవగాహన కల్పించి

విద్యార్థులకు ప్రయోగాలు, దృశ్య శ్రవణ విధానం ద్వారా బోధిస్తే మరింత విజ్ఞానవంతులుగా ఎదుగుతారని స్థానిక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు సోమవారం దండేపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి నైపుణ్యాలు పెంచేలా చూడాలన్నారు. రిసోర్స్‌పర్సన్ అప్పాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, దండేపల్లి

రైతేరాజు 6లో

నేడు జిల్లాకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ రాక

ఏసీసీ, న్యూస్‌టుడే : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంచిర్యాలకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా రానున్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఉదయం 10.30గంటలకు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల ప్రతినిధులు, ఈఆర్వోలు, ఏఈఆర్వో, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

87.79 శాతమే బియ్యం పంపిణీ

ఏసీసీ, న్యూస్‌టుడే : పేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ గడువును పొడిగించారు. సోమవారం వరకు జిల్లాలో 87.79 శాతమే పూర్తయింది. ఇంకా వివిధ కారణాలతో రేషన్ తీసుకోని లబ్ధిదారులకు పౌరసరఫరాల శాఖ మరోసారి అవకాశం కల్పించింది. వర్షాకాల నేపథ్యంలో లబ్ధిదారులకు ఒకేసారి ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మూడు నెలల కోటాను పంపిణీ చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 1 నుంచి 31 వరకు పంపిణీ గడువును విధించింది. రేషన్‌షాపుల్లో నిల్వల కొరత, ఇతర కారణాలతో పంపిణీ పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో అవసరం మేరకు ఆయా దుకాణాలకు బియ్యం సరఫరా చేసి పంపిణీ గడువును సెప్టెంబరు 5 వరకు పొడిగించింది.

సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ స్వాతి, కమిషనర్ రమేష్, వైస్‌ఛైర్మన్ సత్యనారాయణ

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

● పలు అంశాలకు కౌన్సిల్ ఆమోదం

బెల్లంపల్లి, న్యూస్‌టుడే : బెల్లంపల్లి మున్సిపల్ సాధారణ సమావేశం ఎప్పటిలాగే సాదాసీదాగా కొనసాగింది. ఛైర్‌పర్సన్ దావ స్వాతి అధ్యక్షతన సమావేశం జరిగింది. 14 అంశాలకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా పోచమ్మ చెరువు, గొంతెమ్మ గుట్ట, జాతికుంట చెరువు మైక్రో స్టేషన్ క్వారీ, అంబేడ్కర్‌నగర్ చెరువు వద్ద లైటింగ్ కోసం రూ.5 లక్షలు కేటాయించారు. రోడ్ల విస్తరణలో భాగంగా ఏఎంసీ ఏరియా నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు రూ.4.60 లక్షలు, ఏసీపీ కార్యాలయం నుంచి గాంధీ చౌరస్తా వరకు విద్యుత్తు స్తంభాల తొలగింపు కోసం టీజీఎన్‌పీడీసీఎల్‌కు చెల్లించడానికి రూ.4.98లక్షలకు ఆమోదం తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పోచమ్మ చెరువు వద్ద నిర్వహణ కోసం రూ.3లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్యాలయం నిర్మాణం తర్వాత మిగిలిన రూ.13.50లక్షల నిధులను కార్యాలయ మౌలిక సదుపాయాల కోసం కేటాయించాలని ఆమోదించారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, వైస్‌ఛైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు

భీమిని, మంచిర్యాల సిటీ, న్యూస్‌టుడే : నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్తు సరఫరా అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. సోమవారం మంచిర్యాల నగర పరిధిలోని ఆర్‌కే-6 ఉపకేంద్రం, భీమిని సబ్‌స్టేషన్‌లో నూతన అదనపు 5ఎంవీఏ పవర్ నియంత్రికను ఏర్పాటు చేసి ప్రారంభించారు. జిల్లా ఎస్ఈ రాజన్న, డీఈలు రాజేశం, ప్రభాకర్, ఏడీఈలు రవికుమార్, శరత్‌కుమార్, ఏఈలు రాజనర్సు, రాంచందర్, ఖలీం, సబ్‌ఇంజినీర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా గ్రామ సభలు

● వికసిత్ భారత్ లక్ష్యంగా పనుల గుర్తింపుపై కసరత్తు

న్యూస్‌టుడే, మంచిర్యాల గ్రామీణం

వీబీ జీరాంజీ పథకం కింద ప్రతి గ్రామంలో నిరుపేద కుటుంబానికి కనీసం 125 రోజుల పనిదినాల ఉపాధిని కల్పించాలనే లక్ష్యంతో పనుల కల్పన, గుర్తింపు కోసం జిల్లా వ్యాప్తంగా ఊరూరా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రజల సాధికారత, అభివృద్ధితో పాటు ప్రభుత్వ పథకాలను సమన్వయం చేసుకుంటూ సుసంపన్నమైన బలమైన గ్రామీణ భారత్‌ను నిర్మించడం ప్రభుత్వ ఏకైక లక్ష్యం. ఈ మేరకు ప్రతి పంచాయతీకి వికసిత్ గ్రామ పంచాయత్ ప్లాన్స్ (వీజీపీపీ) రూపొందించాల్సి ఉంటుంది. ప్రధానంగా ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాలు, లోటుపాట్లు, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 'బాటమ్ అప్ పార్టిసిపేటరీ ప్లానింగ్ ప్రాసెస్' ద్వారా గ్రామాభివృద్ధి ప్రణాళికను రూపొందించేందుకు కసరత్తు చేపట్టారు. సెప్టెంబర్ 11 వరకు గ్రామ సభలు పూర్తిచేసి గ్రామాభివృద్ధి ప్రణాళికను తయారు చేసే పనులు జిల్లాలో ప్రారంభమయ్యాయి.

వీజీపీపీ తయారీలో పరిశీలించే అంశాలివే

జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో మౌలిక సదుపాయాలతో పాటు గ్రామాభివృద్ధి అవసరాలు, గ్రామంలోని ఆస్తులు, వనరులు, సదుపాయాలను ప్రజల సమక్షంలో గుర్తించి నమోదు చేసుకుంటారు. తాగునీటి సరఫరా, నీటి భద్రత, రహదారులు, పారిశుద్ధ్యం నిర్వహణ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్యం, ఇతర మౌలిక సదుపాయాల పరిస్థితిని సమీక్షించనున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం అవసరమైన పనులు, లబ్ధిదారుల సంఖ్య, సాంకేతికత ఏర్పాటుకు దశలవారీగా ప్రణాళికలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటారు. వ్యవసాయం, సాగు నీటి కాలువల రూపకల్పన, మరమ్మతు, నీటి కుంటల నిర్మాణం, మార్కెట్‌యార్డులు, విద్య, వైద్యం, తాగునీటి సరఫరా వంటి పనులు చేపట్టేందుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ పనుల గుర్తింపు కోసం ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, గ్రామప్రజలు, రైతులను భాగస్వాములుగా చేర్చి పనులు చేస్తున్నారు.

హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్ గ్రామసభలో పనుల నివేదికను చదువుతున్న అధికారి

జిల్లా వివరాలు ఇలా..	మండలాలు : 16	పంచాయతీలు : 306

నమూనా ప్రకటన

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటుయగు శ్రీ .... నివాసంగా శ్రీ .... వారికి చెందినటువంటి గృహము ఇంటి నెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింది హద్దులు గల ఉత్తరం : ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం : 20 ఫీట్ల రోడ్డు, తూర్పు: ఇతరుల ఖాళీ జాగా, పడమట: .... గారి ఇల్లు, పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహా నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిమ్‌లు నా క్లయింటును బైండ్ చేయజాలవు.

సం/-

విజ్ఞతగల నిర్ణయం. వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు

లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.

GST 5% Applicable

వివరాలకు: 80087 09949, 80087 09960
ఆదిలాబాద్: 91214 49286, నిర్మల్: 80087 09961, భైంసా: 80087 09957
మంచిర్యాల: 80087 09946, కుమురంభీం: 91549 92560

నువ్వు.. ప్రయోజనం బాగు

● వానాకాలం సాగు చేస్తే లాభాలు

మంచిర్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే : వానాకాలంలో ఆరుతడి పంటగా నువ్వు సాగు చేస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని నేలలు ఈ పంటకు అనుకూలమని.. దీనిని సాగు చేస్తే తక్కువ నీటితో గిట్టుబాటు ధర పొందవచ్చని వ్యవసాయ అధికారి అంజిత్‌కుమార్ వెల్లడించారు. వర్షాభావం వల్ల ఏ పంటలు సాగు చేయకపోతే త్వరగా వీటిని సాగు చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందే అవకాశముంది. ఇది 90 రోజుల పంట కావడంతో పాటు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుంది.

నువ్వు పంట

సస్యరక్షణ చర్యలు ఇలా...

పేనుబంక : పంట వేసిన 25 రోజుల్లో ఈ పురుగు ఆశిస్తుంది. ఇది ఆశించిన చోట ఆకుల నుంచి తేనెలాంటి జిగురు పదార్థం విడుదల కావడం వల్ల ఆ పరిసరాల్లో చీమలు వస్తాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్ల లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రైతేరాజు

తామర పురుగులు, పచ్చదోమ : ఆకుల అడుగు భాగాన చేరి ఆకుల నుంచి రసాన్ని పీల్చివేస్తాయి. ఆకులు ముందుగా పాలిపోయి తర్వాతి దశలో ఎండిపోతాయి. తెల్లనల్లి ఆశిస్తే ముదురు ఆకుపచ్చ రంగుకు మారి ఈనెలు పొడవుగా కిందకు సాగి ముడుచుకుపోతాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లనల్లి నివారణకు డైకోఫాల్ 5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

● వీటితో పాటు ఆకుముడత, కాయతొలిచే పురుగు, కోడు ఈగ, వేరుకుళ్లు, కాండం తెగుళ్లు, ఆకుమచ్చ, వెర్రి, బూడిద తెగులు వచ్చే అవకాశముంది. నివారణకు వ్యవసాయ అధికారుల సూచనతో చర్యలు చేపట్టాలి.

● పంట పసుపు రంగులోకి రాగానే కోసి కట్టలుగా కట్టి కిందకు వేలాడదీసి ఉంచాలి. వారం రోజులు ఎండిన తర్వాత నూర్పిడి చేయాలి. గింజలను 8 శాతం వరకు తేమ వచ్చే వరకు ఆరబెట్టి సంచుల్లో నిల్వ చేసుకోవచ్చు.

● **నేలల రకం :** తేలికైన నేలలు శ్రేష్ఠం. నీరు నిలిచే ఆమ్ల, క్షార గుణాలు కలిగిన నేలలు పనికి రావు. నేలను 2 నుంచి 4 సార్లు మెత్తగా దున్ని రెండు సార్లు గుంటుకతో చదును చేసుకోవాలి. ఎకరాకు 2.5 కిలోల విత్తనాన్ని వేయాలి.

● **విత్తే పద్ధతి :** వరుసల మధ్య దూరం 30 సెం.మీ, మొక్కల మధ్య 15 సెంటీమీటర్లు ఉండేలా చూసుకోవాలి.

● **రకాలు :** శ్వేత, హిమ(జేసీఎస్ 9456), రాజేశ్వరి, చందన, గౌరి, జేసీఎస్ 1020 అనుకూలం. కిలో విత్తనానికి 3 గ్రాములు మాంకోజెట్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

● **ఎరువులు :** నత్రజని 25 కిలోలు(55 కిలోల యూరియా), భాస్వరం 8 కిలోలు(30 కిలోల సూపర్ ఫాస్ఫేట్), పొటాష్ 8 కిలోలు(14 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్) వేయాలి.

● **నీటి యాజమాన్యం :** విత్తిన వెంటనే పలుచటి తడి ఇవ్వాలి. తేమ ఎక్కువగా ఉండటం వల్ల మొక్కలు శాఖీయోత్పత్తి జరిగి ఆకులు, కొమ్మలు బాగా వచ్చి పూత, కాయ రాలకుండా ఉంటుంది.

● **కలుపు నివారణకు :** పెండిమిథాలిన్ ఎకరాకు ఒక లీటరు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వంకాయ.. లాభాలు తెచ్చెనయ్యా

సిరికొండ, న్యూస్‌టుడే: సంప్రదాయ పంటలు సోయా, పత్తితో నష్టాలు రావడంతో కూరగాయల సాగు వైపు మళ్లారు. సిరికొండ మండలం రాంపూర్(బి) గ్రామానికి చెందిన రైతు చెండె భావురావు వంకాయ సాగుతో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. రెండేళ్లుగా రెండెకరాల్లో వంకాయ సాగు చేస్తున్న ఆయనకు దిగుబడి ఆశాజనకంగా వస్తోంది. మూడు నెలల కిందట సాగుచేసిన పంటకు మందుల పిచికారీ, కూలీలు, రవాణా, ఇతర ఖర్చులకు సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఇప్పటి వరకు పంట విక్రయాల ద్వారా రూ.3లక్షల వరకు ఆదాయం వచ్చిందని రైతు భావురావు తెలిపారు. రెండు నెలల పాటు పంట దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో మరో రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భావురావు చేనులో వంకాయ పంట

ఆదర్శం

☛ రెండేళ్లుగా వంకాయ సాగు చేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. తక్కువ వ్యవధిలో పంట చేతికొచ్చింది. వారానికి రెండు సార్లు తెంపి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇచ్చోడ, ఆదిలాబాద్ మార్కెట్‌లకు వంకాయలు తీసుకెళ్తున్నారు. ఒక్కసారి తెంపినప్పుడు 30 బుట్టలు వంకాయలను మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతు తెలిపారు. ప్రస్తుతం ఒక్కో బుట్టకు రూ.600 ధర పలుకుతోందని చెప్పారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

డా.పి.సాధ్వి, శాస్త్రవేత్త
బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి
చరవాణి సంఖ్య : 93811 81253

? ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు ఏ పంటలు సాగు చేసుకోవచ్చు? - **రమేష్, బెల్లంపల్లి**

✓: నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి పంటలను సాగు చేసుకోవచ్చు. నువ్వులు, అలసంద, ఉలవలు, కూరగాయలను సాగు చేసుకోవచ్చు.

? : వరిపంటలో ఆకుముడత పురుగు సోకింది. నివారణ ఎలా? - **వెంకటేష్, నెన్నెల**

✓: పురుగు ఉధృతి గమనిస్తే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ లేదా ఫ్లూబెండమైడ్ 0.1 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు సమస్య ఉన్న ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలి.

- న్యూస్‌టుడే, బెల్లంపల్లి పట్టణం

గొర్రెలకు నీలి నాలుక ముప్పు

మీకు తెలుసా?

వర్షాకాలం కావడంతో గొర్రెలకు నీలి నాలుక వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుందని దీని పట్ల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలని మండల పశువైద్యాధికారి డా.రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రస్తుతం దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల వ్యాధికి ఎక్కువగా గురవుతాయని వెల్లడించారు. వ్యాధి సోకిన పది రోజులకు లక్షణాలు బయటపడతాయి. వ్యాధి సోకితే జీవాలు నీరసంగా కనిపిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిపడతాయి. పాకలను శుభ్రంగా ఉంచాలి. పాక దగ్గర నీరు నిలవకుండా చూడాలి. దోమలు, ఇతర కీటకాల బారిన పడకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య వేపాకు లేదా కలబందను కాల్చి మంద లేదా పాక దగ్గర పొగ వేయడం ద్వారా కీటకాల బెడదను తగ్గించవచ్చు. అనారోగ్యానికి గురైన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స చేయించాలి. లేకుంటే మిగతా జీవాలకు వ్యాధి సోకే అవకాశముంటుంది. **- న్యూస్‌టుడే, దండేపల్లి**

సమావేశం నుంచి బయటకు వస్తున్న ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లతో భాజపా కౌన్సిలర్లు

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్, భారాస, ఎంఐఎం కౌన్సిలర్లతో పుర ఛైర్‌పర్సన్ బండారి అనూష

ఉత్కంఠ నడుమ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా

ఫలించిన కూటమి ఎత్తుగడ

ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఉత్కంఠ నడుమ ఆదిలాబాద్ మున్సిపల్ కోఆప్షన్ ఎన్నిక మరోసారి వాయిదా పడింది. ముందుగా అనుకున్నట్లుగా కూటమి నేతలు వేసిన ఎత్తుగడ ఫలించినట్లు తెలుస్తోంది. గుర్రుగా ఉన్న భాజపా నేతలు ఈ విషయంపై కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

స్వతంత్రుల మద్దతుతో సరిపడా సంఖ్యాబలం ఉండటంతో భాజపా మొదటినుంచి తమదే విజయమని నమ్మకంతో ఉంది. ఇటు కూటమిగా ఏర్పడిన కాంగ్రెస్, భారాస, ఎంఐఎంకు చెందిన ముఖ్యనేతలు వాయిదా వేసేందుకు వ్యూహరచన చేస్తూ రావడం.. సమావేశం జరిగేలా భాజపా అధికారులపై ఒత్తిడి తీసుకు రావడంతోనే ఎన్నికకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. చివరకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకొని అధికారులకు సూచనలిచ్చారనే ప్రచారం రాజకీయపరంగా వేడిపుట్టిచ్చింది.

40 నిమిషాలపాటు రగడ

మున్సిపల్ కార్యాలయంలో సమావేశం సరిగ్గా 3 గంటలకు ప్రారంభమైన వెంటనే కూటమి కౌన్సిలర్లు గళమెత్తారు. అభివృద్ధిపై ధ్యాస ఎందుకు లేదని భూకబ్జాలపై చర్చించాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై ఆరోపణలు సంధించారు. కూటమి కౌన్సిలర్లందరూ పోడియం వద్దకు దూసుకెళ్లడంతో అక్కడ రగడ నెలకొంది. ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఛైర్‌పర్సన్ అనూష, పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ వద్ద డిమాండ్ చేశారు. గతంలోనే భాజపా తాత్కాలిక ఛైర్‌పర్సన్‌ను కూర్చోబెట్టి ఎన్నిక చేపట్టాక మళ్లీ ఎన్నిక అని ఎందుకని అడుగుతున్నారని ప్రశ్నించారు. ఇలా దాదాపు 40 నిమిషాలపాటు సభ్యుల నినాదాలతో దద్దరిల్లింది. చివరకు ఛైర్‌పర్సన్ సమావేశం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో భాజపా ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర కౌన్సిలర్లు కలిసి తాము బలపర్చిన నలుగురు కోఆప్షన్ సభ్యుల పేర్లతో పుర కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం పుర కార్యాలయ ప్రాంగణంలో కూటమి కౌన్సిలర్లు భూకబ్జాలపై ప్లకార్డులు ప్రదర్శించారు. భాజపా కూటమి నేతలు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. 51 మంది సభ్యుల్లో సమావేశానికి ఒక కాంగ్రెస్, ఒక ఎంఐఎం కౌన్సిలర్ గైర్హాజరయ్యారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు సునీల్, నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

శాంతిభద్రతల దృష్ట్యా..

ముందుగా అభివృద్ధి, భూకబ్జాపై చర్చించి ఆ తరువాత కోఆప్షన్ ఎన్నిక నిర్వహించాలని తోటి సభ్యులు పట్టుబట్టారు. సమావేశం సజావుగా జరగాలని వారికి సూచించాం. సభ్యులు మాత్రం ప్రజల కోసం కూర్చున్నాం.. తొలుత ప్రజా సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. గందరగోళం నెలకొనడంతో అక్కడ సమావేశం నిర్వహించే వాతావరణం కనిపించ లేదు. అందుకనే శాంతి భద్రతల దృష్ట్యా వాయిదా వేశాం. **- బండారి అనూష, ఛైర్‌పర్సన్**

కుట్ర పూరితంగానే..

సమస్యలను గత సమావేశాల్లో ఎందుకు ప్రస్తావించలేదు. భాజపాకు 27 మంది సంఖ్యాబలం ఉండడంతోనే కుట్రపూరితంగా వాయిదా వేశారు. మూడు పార్టీలు ఒక్కటయ్యాయి. మాజీ మంత్రి జోగురామన్న కాంగ్రెస్ పార్టీకి అమ్ముడుపోయి ఈ తతంగం నడిపించారు. రామన్న పదేళ్ల హయాంలో మున్సిపాల్టీలో జరిగిన అక్రమాలపై కోర్టుకు ఆధారాలు ఇస్తాం. ఎన్నిక వాయిదాపై న్యాయం కోసం కోర్టుకు వీడియో సమర్పిస్తాం. **- ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్**

తూము సాయిలు

ఆవుల గంగాధర్

తులసీరాం

తూము గౌరబాయి

దైవ దర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

కుభీరు, న్యూస్‌టుడే: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జీపు ముందు టైరు పేలి వాహనం బోల్తా పడడంతో కుభీరు మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలైన ఘటన మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణమాస సోమవారాన్ని పురస్కరించుకొని పార్డి(బి)కి చెందిన పదిమంది కలిసి ఒక జీపులో ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సమీపంలోని కైలాస్‌టేక్డి(శివాలయం) దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. అక్కడి నుంచి మహారాష్ట్రలోని సాసర్‌కుండ్ వద్ద ఉన్న శివాలయాన్ని దర్శించుకొని తిరిగి వస్తుండగా.. మహారాష్ట్రలోని తోటంబ సమీపంలో జీపు ముందు టైరు పేలి అదుపుతప్పి వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో తూము సాయిలు(60), తూము గౌరబాయి(62), ఆవుల గంగాధర్(61) అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు క్షతగాత్రులను భైంసా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వాహన చోదకుడు దాహెగాం తులసీరాం(26) మృతిచెందారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నియంత్రికల దొంగల ముఠా అరెస్టు

250 కేజీల రాగి తీగ, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

నిందితులను ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సాయికిరణ్, పక్కన సీఐలు

భైంసా, న్యూస్‌టుడే : భైంసా డివిజన్‌లో విద్యుత్తు నియంత్రికలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడిన ముఠాను ముథోల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం పట్టణ ఠాణాలో నిందితులను ప్రవేశపెట్టిన ఏఎస్పీ సాయికిరణ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షెడికే గణేశ్, గంటల్‌వాడ్ సాయినాథ్(ఎలక్ట్రీషియన్), నక్కల్‌వాడ్ గణేశ్, రత్నెల్లి గజానంద్, ఘుగ్రే దీపక్, భైంసా పట్టణానికి చెందిన పిట్లోల్ల పోశెట్టి(ఎలక్ట్రీషియన్)తోపాటు ఓ మైనర్ బాలుడు జల్సాల కోసం ఎనిమిది నెలలుగా డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసి అందులోని రాగి తీగలు దొంగలించారు. వీరిపై ముథోల్, తానూరు, కుభీరు, బాసర, కుంటాల, భైంసా పట్టణం, గ్రామీణ ఠాణాల్లో 33కేసులు నమోదయ్యాయి. ఎస్పీ డా.జి.జానకి షర్మిల నేతృత్వంలో నియంత్రికల దొంగలను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ముథోల్ పోలీసులు ఏడుగురిని పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకొన్నారు. వారి నుంచి 250కేజీల రాగి తీగలు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఏడు చరవాణులు, దొంగతనాలు వినియోగించిన కటింగ్ ప్లేయర్, దబ్బనం ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ముథోల్, బాసర సీఐలు రవీందర్ నాయక్, దీపక్, ముథోల్, తానూరు ఎస్సైలు బి.పెర్సిస్, షేక్ జుబేర్, ఏఎస్సై నర్సింగ్ భాను, సిబ్బంది రాజేందర్, అమర్‌నాథ్, పోతన్న, గజేందర్, వెంకటసాయి, నరేంద్రచారి, గగన్, సందీప్, వెంకట్‌రావును ఏఎస్పీ అభినందించారు.

అటవీ ప్రాంతంలో విరివిగా పెరిగిన పుట్ట గొడుగులు

సహ్యాద్రిపై 'సహజ' పుట్ట గొడుగులు

సారంగాపూర్, న్యూస్‌టుడే : ఎక్కువ పోషకాలుండే పుట్టగొడుగులు తినడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. నిర్మల్-ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దుగా ఉన్న సహ్యాద్రి పర్వతాలపై ప్రకృతి ఒడిలో సహజ సిద్ధంగా పెరిగిన పుట్టగొడుగులు లభ్యమయ్యాయి. సోమవారం క్షేత్ర పర్యటనకు వెళ్లిన సారంగాపూర్ ఉప అటవీ క్షేత్రాధికారి మహ్మద్ నజీర్‌ఖాన్ వాటిని గుర్తించారు. రొయ్య, కోడికూర, చీమ, తెల్ల, చెదల పుట్ట గొడుగులుగా స్థానికంగా వీటిని పిలుస్తుంటారు. టెర్మిటోమైసెస్ మైక్రోకార్పస్ శాస్త్రీయ నామం కలిగిన లయోఫిల్లాసియో కుటుంబానికి చెందిన ఇవి ఆకురాల్చే అడవులు, వెదురు మొదళ్లల్లో వద్ద పెరుగుతుంటాయని ఆయన తెలిపారు.

ఎస్టీపీపీ వో అండ్ ఎం నిర్వహణపై గందరగోళం!

జైపూర్, న్యూస్‌టుడే: జైపూర్ మండలం పెగడపల్లి సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం వోఅండ్‌ఎం(ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్) బాధ్యతలపై ఉత్కంఠ నెలకొనగా కార్మిక వర్గం గందరగోళానికి గురవుతోంది. ఎస్టీపీపీలో 600 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్ల వోఅండ్‌ఎం బాధ్యతలను 2021 జూన్‌లో పవర్‌మేక్ సంస్థ 7 సంవత్సరాలకు (రెండేళ్ల ఎక్స్‌టెన్షన్ కలుపుకొని) దక్కించుకోగా.. ఈఏడాది మేలో 5ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం అన్ని ఖర్చులు కలుపుకొని ప్రతి నెలా పవర్‌మేక్ సంస్థకు నిర్వహణ కింద సింగరేణి యాజమాన్యం రూ.7కోట్ల పైచిలుకు చెల్లిస్తోంది. మరో రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ ఇంతకంటే తక్కువ ధరకు వోఅండ్‌ఎం బాధ్యతలు చేపట్టేందుకు ఇతర సంస్థలు ఆసక్తి చూపుతాయనే కోణంలో యాజమాన్యం కొన్నినెలల కిందట టెండర్లు పిలిచింది. కొన్ని సంస్థలు పోటీ పడగా ఇటీవల విడుదల చేసిన టెండర్‌లోనూ ఎల్-1గా పవర్‌మేక్ సంస్థ నిలిచింది. ప్రస్తుతం చెల్లించే ధర కంటే నూతన టెండర్ ద్వారా ఎక్కువ సొమ్ము చెల్లించాల్సి రావడంతో యాజమాన్యం ఆలోచనలో పడినట్లు సమాచారం. మూడు నెలల పొడిగింపుతో సోమవారం(ఆగస్టు 31) వరకే పవర్‌మేక్ నిర్వహణ బాధ్యతలు చేపట్టనుంది. సోమవారం కార్మికుల గేట్ పాస్‌ల గడువు పూర్తికావడంతో గందరగోళం నెలకొంది. టెండర్ గురించి సోమవారం సాయంత్రం వరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేకపోగా.. కొన్ని కార్మిక సంఘాలకు వారం వరకు పాస్‌ల గడువు పొడిగించాలని మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. పాస్‌ల విషయంలో ఆందోళన చెందకుండా పాతవాటితోనే విధులకు హాజరు కావాలని పలు కార్మిక సంఘాలు సామాజిక మాధ్యమాల ద్వారా విషయాన్ని తెలియజేశాయి. ఈ విషయమై ఎస్టీపీపీ ఈడీ చిరంజీవిని వివరణ కోరగా... నిర్వహణ బాధ్యతలను పవర్‌మేక్ సంస్థకే అప్పగించామని, ప్రక్రియ రెండు వారాల కిందటే పూర్తయిందని చెప్పారు. గేట్‌పాస్‌ల విషయంలో కార్మికులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం

మారథాన్‌లో ఇందారం యువకుల ప్రతిభ

జైపూర్, న్యూస్‌టుడే : హైదరాబాద్ రన్నర్స్, ఎన్ఎండీసీ సంయుక్తంగా ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో నిర్వహించిన మారథాన్-15వ ఎడిషన్‌లో ఇందారం యువకులు ప్రతిభ కనబరిచారు. 42.95 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌లో సంకటి సంతోష్, 21.95 కిలోమీటర్ల ఆఫ్ మారథాన్‌లో అరికె సంతోష్ ప్రతిభ చూపారు. కాగా వీరిద్దరు గతంలోనూ పలు మారథాన్‌లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.

మారథాన్‌లో ప్రతిభ చూపిన అరికె సంతోష్, సంకటి సంతోష్

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల ప్రారంభం

విద్యార్థులతో కలిసి అల్పాహారం తింటున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో విద్యార్థులతో అతిథులు అల్పాహారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏ విద్యార్థి అర్ధాకలితో బడికి వెళ్లకూడదనేది ప్రజా ప్రభుత్వం సంకల్పమన్నారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస, కాంతేయ దాస, నగర మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, తదితరులున్నారు.

అంతర్ జిల్లాల స్థాయి పోటీల్లో మనోళ్లకు కాంస్యం

కాంస్య పతకం సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు క్రీడాకారులు

రెబ్బెన, న్యూస్‌టుడే: మెదక్ జిల్లాలో గత నెల 28-30 వరకు జరిగిన అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు కాంస్య పతకం సాధించింది. సెమీ ఫైనల్‌లో వరంగల్ జట్టుపై 35-33, 35-32 పాయింట్ల తేడాతో ఓడింది. మూడో స్థానంలో నిజామాబాద్ జట్టుపై 35-25, 35-28 స్కోర్ చేసి గెలుపొంది కాంస్య పతకాన్ని సాధించినట్లు ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు డా.కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతిలు తెలిపారు. పురుషుల జట్టు హైదరాబాద్‌పై ఓటమి పాలై నాలుగో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. పతకాన్ని సాధించిన జిల్లా జట్టును జిల్లా ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌లు మహేందర్, భాస్కర్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంయుక్త కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు అభినందించారు.

అమర వీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, సభ్యులు

తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుందాం

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆదివాసీ అమర వీరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్తామని వీర తెలంగాణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం ఇంద్రవెల్లిలో అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి, జాగో తెలంగాణ యాత్రకు శ్రీకారం చుట్టారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని కాపాడుకుందామన్నారు. కుల, మత, రాజకీయాలను వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని చెప్పారు. యువత, మహిళలు, రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలను రాజకీయాల్లోకి ఆహ్వానించడమే లక్ష్యమన్నారు. ఇంద్రవెల్లి నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల కిలోమీటర్ల వరకు కొనసాగుతుందన్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుంటామని పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ముగింపు పలుకుతామన్నారు. అనంతరం కేస్లాపూర్ గ్రామానికి వెళ్లి ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజన, వివేక్, అమూల్య, సుమన్, సతీష్, దిలీప్, గురువయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

సీఈఓలుగా పదోన్నతి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది మందికి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)లుగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం డిప్యూటీ సీఈఓ హోదాలో ఉన్న వీరికి ఇక సీఈఓగా హోదా కల్పించనున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆర్.లక్ష్మీనారాయణ, ఆదిలాబాద్ గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ)గా పనిచేస్తున్న రవీందర్‌రాఠోడ్ పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు.

తొలి మావోయిస్టు మహిళా నేత కన్నుమూత

రాధక్క

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, ఎదులాపురం: తెలంగాణ తొలి మావోయిస్టు ఆదివాసీ మహిళ, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న సతీమణి కుర్సెంజ్ మోతీబాయి అలియాస్ రాధక్క(55) అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. మూడురోజుల కిందట ఆదిలాబాద్ రిమ్స్‌లో చేరిన ఆమె సోమవారం సాయంత్రం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె స్వస్థలం ఆదిలాబాద్ గ్రామీణ మండలం పిప్పల్‌ధరి. బాల్యం నుంచే ఆదివాసీ హక్కుల కోసం నినదించిన ఆమె 1984లో పీపుల్స్‌వార్‌లో చేరారు. దళసభ్యురాలి నుంచి రాష్ట్ర కమిటీ బాధ్యతల నిర్వహణ వరకు ఆమె ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విప్లవోద్యమ కార్యకలాపాలు, కార్యక్రమాల అవసరాలరీత్యా పార్టీ ఆమెను 1998లో ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేసింది. అక్కడ ఆదివాసీలను సంఘటితం చేయటంలో చురుకైన పాత్ర పోషించారు. 2017లో అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి వెళ్తుండగా ఆమె ప్రయాణిస్తున్న వాహనం ఖమ్మం దగ్గర వెంటాడుతున్న పోలీసులను తప్పించే క్రమంలో బోల్తాపడింది. గాయాలతో బయటపడి పోలీసులకు పట్టుబడిన ఆమె నాలుగేళ్లపాటు జైలు జీవితం గడిపారు. ఆ తర్వాత ఆమెపై ఉన్న కేసులను కోర్టు కొట్టివేసింది. గతేడాది నవంబరులో చంద్రన్న ఉద్యమం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఇద్దరు కలిసి రామగుండంలో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో పిప్పల్‌ధరికి వచ్చిన ఆమె మూడురోజుల కిందట రిమ్స్‌లో చేరారు. మంగళవారం మధ్యాహ్నం లింగుగూడలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపై ప్రజాసంఘాల బాధ్యులు, వామపక్షవాదులు నివాళులర్పించారు.

గ్రామీణుల సేవల్లో ఐపీపీబీ

న్యూస్‌టుడే, భుక్తాపూర్:

పోటీ ప్రపంచంలో అన్ని బ్యాంకులకు దీటుగా మెరుగైన సేవలు అందించాలని భారత ప్రభుత్వం తపాలా శాఖ ఆధ్వర్యంలో 2018లో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ)ను ప్రారంభించింది. బ్యాంకులు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల వారికి సులభంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. దేశంలోని ప్రముఖ కంపెనీలతో కలిసి ప్రమాద బీమా పాలసీలను ప్రవేశపెట్టింది. మంగళవారం తొమ్మిదో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా కథనం.

- ☛ జీరో బ్యాలెన్స్‌తో ఖాతా తెరవవచ్చు.
- ☛ బ్యాంకులో గరిష్ఠంగా రూ.2లక్షల వరకు బ్యాలెన్స్ ఉంచుకోవచ్చు.
- ☛ ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా సులభంగా డబ్బులు పంపవచ్చు.
- ☛ ఐపీపీబీ మొబైల్ యాప్ ద్వారా కరెంటు, గ్యాస్, డీటీహెచ్, రీఛార్జ్‌లు చేసుకోవచ్చు.
- ☛ గ్యాస్ రాయితీ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల డబ్బులు నేరుగా ఐపీపీబీ ఖాతాలో జమ అవుతుంది.

ఉమ్మడి జిల్లాలో వివరాలు

- ☛ ఐపీపీబీ ఖాతాలు : 6 లక్షలు
- ☛ ప్రమాద బీమా పాలసీలు : 50 వేలు
- ☛ ప్రమాద బీమా పాలసీ క్లెయిమ్‌లు : రూ.2 కోట్లు
- ☛ బాల ఆధార్ నమోదు : 10 వేలు
- ☛ ఆధార్ మొబైల్ నవీకరణ : 20 వేలు

తరోడ గ్రామానికి చెందిన లక్ష్మణ్ రూ.549తో ఆదిత్య బిర్లా ప్రమాద బీమా పాలసీ చేసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు బోల్తా పడి ఆయన మరణించారు. నామినీగా ఆయన భార్య భూమిబాయికి రూ.10 లక్షలు చెక్కును కలెక్టర్ రాజర్షి షా చేతుల మీదుగా ఐపీపీబీ తపాలా సిబ్బంది, ఆదిత్య బిర్లా సిబ్బంది అందించారు.

EENADU e Classifieds

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Nutula PetaRamreddy S/o. Nutula Bhojareddy (Oldname) R/o. H.No.3-77, Vill: Madhapur, Mdl: Soan, Dist. Nirmal. TS havechanged myname as Nutula Ramreddy S/o. Nuthula Bhoja Reddy (New name).

మంచిర్యాలలో త్వరలో ప్రారంభం కాబోతున్న షాపింగ్‌మాల్‌లో పని చేయుటకు సేల్స్‌బాయ్స్ మరియు సేల్స్ గర్ల్స్ కావలెను. Cell: 83090 34069.

రాఘవ అసెట్ ఫైనాన్స్ ప్రై.లి.లో చేయుటకు అభ్యర్థులు కావలెను. బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్-11, జీ: 16K-18K. & షోరూం ఎగ్జిక్యూటివ్స్-03, జీ: 15 K. Locations: ఆదిలాబాద్, నిర్మల్, లక్షెట్టిపేట్, మంచిర్యాల, కాగజ్‌నగర్. Cont. 7337551744/705

REAL ESTATE

బ్యాంక్ సీజ్ చేసిన ఓపెన్ ప్లాట్స్ మరియు ఇండివిడ్యువల్ హౌసెస్ అమ్మకానికి కలవు. ఆసక్తి కలవారు సంప్ర॥ 8886068456 (శ్యామ్).

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k శిక్షణ రుసుము కలదు. సెల్: 8886977750.

JOBS

Staff Required For CCTV Cameras Installation & Servicing in Mancherial. Lorven I Zone CCTV Cameras. 94404 84878.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs. 300/- Only
Colour Rs. 350/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
Adilabad:
80087 09949
90005 66042

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..
మంచిర్యాల : 98663 07290
చెన్నూరు : 80085 73627
బెల్లంపల్లి : 99496 20369
కాసిపేట : 91001 77174
(10 AM TO 1 PM)

? చెన్నూరు గ్రామీణం : ప్రతాప మారుతి మందిర్ నుంచి కొత్తగూడెంకు వెళ్లే సిమెంటు రోడ్డు గుంతలుగా మారింది. - **రాజేష్, చెన్నూరు**

✔ రహదారిని పరిశీలించి గుంతలను పూడ్చివేయించేలా చర్యలు తీసుకుంటాం. - **మారుతిప్రసాద్, పుర కమిషనర్, చెన్నూరు**

ఈనాడు స్పందనకు వందనం

చెట్ల తొలగింపు

చెన్నూరు గ్రామీణం: చెన్నూరు మండలంలోని బావ్‌రావుపేటలో నిర్వహణ లేక పల్లె ప్రకృతివనం అధ్వానంగా తయారుకావడంపై 'కళావిహీనంగా.. ప్రకృతివనం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. లోనికి ప్రవేశించే ద్వారం ముందు ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలతో పాటు చెత్తాచెదారాన్ని తొలగించారు.

నిషేధిత జాబితా నుంచి ఇళ్లను తొలగించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : నిషేధిత జాబితాలో ఉన్న మంచిర్యాల ప్రజల ఇళ్లను జాబితా నుంచి తొలగించాలని భారాస రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న విధానాలకు సోమవారం కలెక్టరేట్ ముందు భారాస నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 10,332 ఇళ్లు 22ఏ నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు. పట్టా భూములు కలిగి, ప్రభుత్వం అనుమతులు పొంది నిర్మించుకున్న ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. ఎన్టీఆర్‌నగర్, తిలక్‌నగర్, రాజీవ్‌నగర్, ఆండాళమ్మ కాలనీ ప్రజలకు గత ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేస్తే ఇప్పుడు నిషేధిత జాబితాలో చేర్చడంపై ఆందోళన చెందుతున్నారన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వి.రాములుకు వినతిపత్రాన్ని అందజేశారు.

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న భారాస నాయకులు

బకాయిలు చెల్లించాలని నిరసన

ఏసీసీ, న్యూస్‌టుడే : విద్యార్థులకు సంబంధించిన బోధనా రుసుం, ఉపకార వేతనాలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సదానందం పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ధ్రువపత్రాల కోసం వెళితే యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయన్నారు. అదనపు కలెక్టర్ వి.రాములుకు వినతిపత్రాన్ని అందజేశారు. రాజు, ప్రభాకర్, చంద్రశేఖర్, రామస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి

కాసిపేట : ప్రభుత్వం తమకు అందించే డీఏ బకాయిలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. కాసిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ప్రజావాణి అనంతరం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఆహారం తయారీలో జాగ్రత్తలు తీసుకోండి

హైదరాబాద్, న్యూస్‌టుడే : బెల్లంపల్లిలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు జులై 23న అస్వస్థతకు గురైన సంఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా విచారణ చేపట్టింది. దీనిపై జిల్లా కలెక్టర్ కమిషన్‌కు నివేదికను సమర్పించారు. అందులో బాధిత విద్యార్థినులకు వైద్య చికిత్స అందించామని, పిల్లలంతా ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. దీనిపై కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ స్పందిస్తూ.. విద్యార్థులకు అందించే ఆహారం తయారీ, వడ్డించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

రామకృష్ణాపూర్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. సోమవారం ఆర్కేపీ పోలీస్‌స్టేషన్‌ను మందమర్రి సీఐ పర్స రమేష్‌తో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్ పని తీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు.

సాదాసీదాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే: చెన్నూరు పురపాలిక కార్యాలయంలో సోమవారం ఛైర్‌పర్సన్ పెద్దింటి పద్మ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలను అధికారులు సమాధానం చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుడిని ఛైర్‌పర్సన్ వాహనానికి చోదకుడిగా ఎలా నియమిస్తారని ఏడో వార్డు కౌన్సిలర్ కొప్పుల ప్రభాకర్ ప్రశ్నించారు. కార్మికుల కొరతతో పట్టణంలోని పారిశుద్ధ్య పరిస్థితులు సక్రమంగా లేవన్నారు. సిబ్బంది కొరత కారణంగానే పారిశుద్ధ్య కార్మికుడిని కేటాయించినట్లు కమిషనర్ మారుతిప్రసాద్ సమాధానం చెప్పారు. సమావేశంలో 16 అంశాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు.

మూడు దుకాణాల్లో చోరీలు

భీమిని, న్యూస్‌టుడే : భీమినిలో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పలు దుకాణాల్లో చొరబడి నగదు, ఎరువులు ఎత్తుకెళ్లారు. ఎస్సై కోటేశ్వర్ కథనం మేరకు.. తిరుమల బిర్యానీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, వినాయక ట్రేడర్స్ ఎరువుల దుకాణం, స్నేహ సూపర్‌మార్టు షట్టర్లను పగులగొట్టి చొరబడ్డారు. బిర్యానీ సెంటర్‌లో రూ.60వేలు, ఎరువుల దుకాణం నుంచి రూ.28వేలు, సూపర్‌మార్టులో రూ.10వేలు చోరీ చేశారు. డాగ్‌స్క్వాడ్, ప్రత్యేక బృంద సభ్యులు పరిశీలించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వినాయక ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు

విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు

మంచిర్యాలనేరవిభాగం : పోలీసు విధులకు ఆటంకం కలిగించి రోడ్డుపై వీరంగం చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక బస్టాండు వద్ద తిరుపతి, రాకేష్‌లు వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో నలిగేటి వివేక్ మద్యం మత్తులో వారి విధులకు ఆటంకం కలిగించాడు. సిబ్బంది ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

24 మందికి జరిమానాలు

మంచిర్యాల న్యాయ, నేరవిభాగం, న్యూస్‌టుడే : మంచిర్యాల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 24 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు రుజువైందన్నారు. సోమవారం మంచిర్యాల న్యాయస్థానం ఎదుట వారిని ప్రవేశపెట్టగా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.నిరోషా 24 మందికి రూ.40,500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు సీఐ హస్నన్ తెలిపారు.

కార్మికుడి కుటుంబానికి సాయం

జన్నారం: చింతగూడకి చెందిన గల్ఫ్ కార్మికుడు గజ్జెల భూపతి కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు పోగు చేసిన రూ.67,916, భూపతి సభ్యత్వ రుసుం రూ.20వేలు కలిపి మొత్తం 87,916 నగదును భూపతి భార్య శ్వేతకు సోమవారం అందించారు. ఈ ఏడాది జూన్ 7న బహిర్భూమికి వెళ్లిన భూపతి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. అప్పటికే నిండు గర్భిణిగా ఉన్న శ్వేత జులై 1న మగ బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. గల్ఫ్ అసోసియేషన్ సభ్యులను చింతగూడ సర్పంచి సుమలత, ఉప సర్పంచి కావ్య తదితరులు అభినందించారు.

గజ్జెల శ్వేతకు నగదు అందజేస్తున్న గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు

దాటడం కష్టమవుతోంది

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: రవీంద్రఖని రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. స్టేషన్ ఎదుట రోడ్డు, ప్రధాన రహదారికి మధ్యలో ఉన్న స్థలం బండరాళ్లతో, ఎత్తుపల్లాలుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుంత తవ్వారు.. వదిలేశారు

భీమిని మండలం జగ్గయ్యపేట బీసీ కాలనీలో పైపులైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల కిందట భగీరథ పైపులైన్ లీకవడంతో మరమ్మతులు చేపట్టారు. మరమ్మతుల్లో భాగంగా తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో అందులో నీరు నిండి దుర్వాసన వెదజల్లుతోందని కాలనీవాసులు తెలిపారు. - **న్యూస్‌టుడే, భీమిని**



రక్షణ గోడలు లేక పొంచి ఉన్న ప్రమాదం

మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామ సమీపంలోని కొండెంగలవాగు సమీపంలో వంతెనకు ఒకవైపు రక్షణ గోడ లేక ప్రమాదం పొంచి ఉంది. చాలా రోజుల క్రితం రక్షణ గోడలు ధ్వంసం కావడంతో రాకపోకలు సాగించే చోదకులు భయపడుతున్నారు. రాత్రిపూట ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, మందమర్రి పట్టణం**

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఏసీసీ, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో ఓ నర్సుపై జరిగిన హత్య ఘటనలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్డులో ఎస్టీ బాలుర వసతిగృహ విద్యార్థులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శనతో నివాళులు అర్పించారు. నరేష్, విజయ్‌సాగర్, లక్ష్మణ్, అఖిల్, సల్మాన్, సాయి, అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

వేదన విని.. పరిష్కారానికి ఆదేశించి

ఏసీసీ, న్యూస్‌టుడే : ప్రజావాణి ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వి.రాములు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల అర్జీలను స్వీకరించారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వి.రాములు

పాఠశాల భూమిని రక్షించండి

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని హైటెక్‌సిటీ లేఅవుట్ వెంచర్‌లో ప్రాథమిక పాఠశాలకు కేటాయించిన ఎకరం భూమిని ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. చుట్టూ రేకులతో ప్రహరీ నిర్మించి ప్లాట్‌లు చేసి విక్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. - **కాలనీవాసులు**

రోడ్లను తిరిగి పునరుద్ధరించాలి

తెలంగాణ సమగ్ర భూ సర్వేలో భాగంగా నెన్నెల మండలం చిన్నవెంకటాపూర్ గ్రామంలో 98 శాతం సర్వే పూర్తిచేశారు. సర్వేకు వచ్చిన లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు కొలతలు చేపట్టినా గ్రామంలోని పాత రోడ్లను పునరుద్ధరించలేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మరోసారి సర్వే చేపట్టి పాత గ్రామ నక్షా ప్రకారం ఉన్న రోడ్లను ప్రజల అంగీకారం మేరకు తిరిగి ఏర్పాటు చేయాలి.

- **జలంపల్లి భాస్కర్, చిన్నవెంకటాపూర్, సర్పంచి**

స్టేటస్ పెండింగ్‌లో ఉంది

మందమర్రి మండలం చిర్రకుంట గ్రామంలో భార్య రిచా పేరు మీద మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. అధికారులు ఇంటి స్థలాన్ని నిర్ధారించి ఫొటోలు సైతం తీసుకున్నారు. ఎంపీడీవో అప్రూవల్ కూడా అయింది. ఇప్పటికీ స్టేటస్‌లో పెండింగ్ చూపుతోంది. అధికారులు స్పందించి అర్హులమైన మాకు ఇంటిని మంజూరు చేయాలి.

- **దుర్గం శ్యామ్‌కుమార్, మందమర్రి**

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

అంగన్‌వాడీ టీచర్ నిర్లక్ష్యంతో మా బాబు కాలు విరిగింది. దీనిపై సూపర్‌వైజర్, సీడీపీవోలకు ఫిర్యాదు చేస్తే 15 రోజులకు వచ్చి 'టీచర్ ఏం చేస్తుంది... మీదే బాధ్యత' అంటూ చెప్పారు. ఘటన తర్వాత ఆరు నెలల నుంచి అంగన్‌వాడీ కేంద్రం నుంచి మా పిల్లలకు రావాల్సిన పౌష్టికాహారం ఇవ్వట్లేదు. దీనిపై డీడబ్ల్యూవోకు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందించలేదు. - **బాధిత తల్లిదండ్రులు(రత్నం దివ్య-అరుణ్), గుండ్ల సోమవారం, నెన్నెల**

పుష్కరఘాట్ పనులకు భూమిపూజ

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : మంచిర్యాల గోదావరి తీరాన్ని ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక గోదావరి తీరంలో సుమారు రూ.12కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్, నగర కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధు పాల్గొన్నారు.

పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

లక్ష్య సాధనకు కృషి చేయాలి

లక్షెట్టిపేట : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన స్వాగత సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

పోలీసు శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోండి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : కొక్కిరాల రఘుపతి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కానిస్టేబుల్, ఎస్సై పోటీ పరీక్షల శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేర్కొన్నారు. స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

బెల్లంపల్లి, చెన్నూరు పట్టణం, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బెల్లంపల్లి పట్టణంలో ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. పట్టణంలోని కాంటాచౌరస్తాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దావ స్వాతి, పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి రాస్తారోకో నిర్వహించారు.

బెల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి సాయం

జన్నారం, న్యూస్‌టుడే: పేదింటి ఆడ బిడ్డ వివాహానికి సాయం అందించాలని ఈ నెల 30న 'ఈనాడు'లో 'పెళ్లికి మీరే పెద్దలవ్వండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జన్నారానికి చెందిన పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5వేలు, చింతగూడ పంచాయతీ కార్యదర్శి కల్లెం రాజన్న రూ. 5వేలు, జన్నారానికి చెందిన వస్త్ర వ్యాపార సంఘం సభ్యులు రూ. 5వేలు, ఉమాచంద్రిక వస్త్ర దుకాణం యజమాని పెళ్లి కూతురు చీర, రోటిగూడకు చెందిన ఉప్పు సురేశ్ డ్రెస్సింగ్ టేబుల్‌ను సమకూర్చారు. వాటిని సోమవారం దాతలు బీస్కుల మానసకు అందించారు. చింతగూడకు చెందిన బీస్కుల రాములు-సరోజ దంపతుల కూతురు మానస వివాహం వచ్చే నెల 5న జరగనుంది. చింతగూడకు చెందిన బ్యాండ్ నిర్వాహకులు, టెంట్ హౌస్ యజమానులు ఉచితంగా సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్, సభ్యులు రాజ్‌కుమార్, మహేశ్, రాజేందర్, వస్త్రవ్యాపార సంఘం అధ్యక్షుడు సతీష్‌చంద్రగుప్తా, ప్రధాన కార్యదర్శి జగదీశ్, కోశాధికారి తిరుపతి పాల్గొన్నారు.

మానసకు ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి జీఎం ఏవీ రెడ్డి

వ్యక్తిగత రక్షణ పరికరాలు అందించాలి

శ్రీరాంపూర్ గ్రామీణం, మందమర్రి పట్టణం : కార్మికులకు అవసరమైన వ్యక్తిగత రక్షణ పరికరాలు అందించాలని గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యాన్ని కోరారు. సోమవారం మందమర్రి జీఎం రాధాకృష్ణ, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఇన్‌ఛార్జి జీఎం ఎ.వెంకటేశ్వర్ రెడ్డి అధ్యక్షతన గుర్తింపు సంఘం ప్రతినిధులతో నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. గనుల్లో విశ్రాంత గదులు, లాకర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాలనీల్లో ఓపెన్ జిమ్, తాగునీటి శుద్ధి యంత్రాలు, డిస్పెన్సరీల్లో సిబ్బంది నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించిన జీఎం త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ఎస్ఓటు జీఎం కృష్ణ ప్రసాద్, బ్రాంచి కార్యదర్శులు సత్యనారాయణ, మల్లేష్, అక్బర్ అలీ, కొమురయ్య, అనిల్‌కుమార్, రవికుమార్, ఆనంద్‌కుమార్, రాజన్న పాల్గొన్నారు.

అసత్యాలతో కాదు అభివృద్ధితో ప్రజల్లోకి వెళ్లాలి

భీమారం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ నాయకులు అసత్య ప్రచారాలు మానేసి చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని భాజపా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ కోరారు. సోమవారం 63వ జాతీయ రహదారిపై గల జోడువాగుల వంతెన వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి నియోజకవర్గ నాయకులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న వంతెన నిర్మాణం పనులకు ఏడాది క్రితం కేంద్ర ప్రభుత్వం రూ.120 కోట్లు విడుదల చేస్తే ఎంపీ, మంత్రి తామే కష్టపడి సాధించినట్లు సంబరాలు, క్షీరాభిషేకాలు చేసుకున్నారని అన్నారు. మందమర్రిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో డబ్బులు దండుకున్న వారి పేర్లు బహిర్గతం చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్షీరాభిషేకం చేస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

ఆలయాల్లో శ్రావణ సందడి

దండేపల్లి, చెన్నూరు పట్టణం : శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని దండేపల్లిలోని శ్రీశివభక్త మార్కండేయ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండేపల్లి, పరిసర గ్రామాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి మహాశివునికి పంచామృత అభిషేకంతో పాటు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నూరు పట్టణంలోని శివాలయం భక్తులతో కిటకిటలాడింది.

సంక్షిప్తం

■ నిర్బంధ తనిఖీలు

కాసిపేట (దేవాపూర్): మండలంలోని దేవాపూర్‌లో ఎస్సై గంగారం ఆధ్వర్యంలో సోమవారం నిర్బంధ తనిఖీలు చేపట్టారు. 45 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, రెండు ట్రాలీల పత్రాలను తనిఖీ చేసి జరిమానా విధించారు.

■ వాహనాల..

మంచిర్యాలనేరవిభాగం: జిల్లా కేంద్రంలో సోమవారం ట్రాఫిక్ సీఐ హస్నన్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. నంబరు ప్లేటు లేని వాహనాలపై నిఘా పెట్టగా 40 వాహనాలకు జరిమానాలు, మరో 12 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

■ ఏకరూప దుస్తులు అందించాలని వినతి

ఏసీసీ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. జశ్వంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

■ సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాలనేరవిభాగం: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సీపీ అంబర్‌కిషోర్ ఝా మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడారు.

■ నేడు పెన్షన్ విద్రోహ దినం

మంచిర్యాల పట్టణం: సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించే పెన్షన్ విద్రోహ దినం విజయవంతం చేయాలని ఉద్యోగుల సంఘాల జేఏసీ జిల్లా ఛైర్మన్ శ్రీహరి కోరారు. మంచిర్యాలలోని టీఎన్‌జీవోస్ భవనంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

■ భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి పట్టణం: ప్రతి రైతు సమగ్ర భూ సర్వే ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం చాకెపల్లి గ్రామంలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ విలాయత్ అలీ, తహసీల్దార్ కృష్ణ, సర్పంచి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

■ ద్విచక్రవాహనం దగ్ధం

తాండూరు: తాండూరు టౌన్‌షిప్‌నకు చెందిన కోడెం సదానందం తన ద్విచక్రవాహనాన్ని ఆదివారం రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచారు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి అది దగ్ధమై ఉంది. దీంతో ఆయన సోమవారం మాదారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

■ అవయవదానానికి నిర్ణయం

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఉపరితల గనిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన మంద మల్లారెడ్డి శరీర, అవయవదానానికి ముందుకొచ్చి ఆదర్శంగా నిలిచారు. సోమవారం గని ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మల్లారెడ్డి దంపతులకు సదాశయ ఫౌండేషన్ ముఖ్యసలహాదారుడు నూక రమేష్ ధ్రువపత్రాన్ని అందజేశారు.

■ నరసింహారావు సేవలు మరువలేనివి

జైపూర్: సింగరేణిలో వివిధ హోదాల్లో పని చేయడంతో పాటు థర్మల్ విద్యుత్తు కేంద్రం అభివృద్ధిలో జీఎం నరసింహారావు చేసిన సేవలు మరువలేనివని ఈడీ చిరంజీవి, జీఎం సూర్యనారాయణ రాజు అన్నారు. సోమవారం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో నరసింహరావును సన్మానించారు.

■ అంబులెన్స్ వాహనంలో ప్రసవం

జన్నారం: హాస్టల్‌తండా గ్రామానికి చెందిన కొమిరె అనసూయ సోమవారం 108 అంబులెన్స్ వాహనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, ఇద్దరిని జన్నారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్లు ఈఎంటీ మునీందర్‌గౌడ్, పైలెట్ మహేందర్ తెలిపారు.

■ తెబొగకాసం పదకొండేళ్లలో ఒకే ఒప్పందం చేసుకుంది

మందమర్రి పట్టణం: తాము అధికారంలో ఉన్న రెండేళ్లలో సింగరేణితో 23 ఒప్పందాలు చేసుకున్నామని.. తెబొగకాసం పదకొండేళ్ల పాలనలో కేవలం ఒకే ఒప్పందం మాత్రమే చేసుకుందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. సోమవారం మందమర్రి సంఘం కార్యాలయంలో మాట్లాడారు.

గాంధారి ఖిల్లాలో సినిమా చిత్రీకరణ

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని అటవీ ప్రాంతంలో గాంధారి ఖిల్లా వద్ద సోమవారం 'కురేన్ ఘాట్' పేరుతో నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభమైంది. జిల్లాకు చెందిన కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలోనే సినిమా నిర్మిస్తున్నట్లు చిత్ర దర్శకుడు విజయ్‌కుమార్, నిర్మాత శంకర్ తెలిపారు.

జ్యోతి వెలిగిస్తున్న బీసీ సంక్షేమశాఖ అధికారిణి నీరటి రాజేశ్వరి

సంచార జాతుల విముక్తి దినోత్సవం

ఏసీసీ, న్యూస్‌టుడే : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి హాజరై పలువురు సంచార జాతుల ప్రతినిధులతో కలిసి మహాత్మా జ్యోతిబాపులే, డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అణచివేతకు గురైన సంచార, అర్ధ సంచార జాతులకు విముక్తి కల్పించి స్వాతంత్ర్యం అనంతరం డీ నోటిఫైడ్ ట్రైబ్స్ గా గుర్తించిన సందర్భంగా ఏటా ఆగస్టు 31న సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీసు అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే : రామగుండం పోలీసు కమిషనరేట్ పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు సోమవారం జరిగాయి. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నుంచి పలువురు వేర్వేరు విభాగాలకు పోటీ చేయగా 70 మంది తమ ఓట్ల ద్వారా పలువురిని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.నవీన్‌కుమార్ (శ్రీరాంపూర్ పీసీ), ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీనివాస్ (సీఐ, సైబర్‌క్రైం), తిరుపతి (ఏఎస్సై, పెద్దపల్లి గ్రామీణ స్టేషన్), ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు (ఎస్సై, సీసీబీ), సంయుక్త కార్యదర్శిగా (ఓంకార్, రామకృష్ణాపూర్, పీసీ), సంస్థాగత కార్యదర్శిగా వినోద్‌బాబు (ఎస్టీపీసీ, పీసీ), కోశాధికారిగా సుందర్‌సింగ్ (ధర్మారం, పీసీ), కార్యనిర్వాహక సభ్యులుగా ఎండీ రిజ్వాన్ షాఖాన్ (సీఎస్బీ, హెడ్‌కానిస్టేబుల్), అనిల్‌కుమార్ (బసంత్‌నగర్, పీసీ), సీహెచ్ దేవరాజ్ (సుల్తానాబాద్, పీసీ), కార్యవర్గ సభ్యులుగా రజిత (పెద్దపల్లి, పీసీ), కపిల్ (ఏఆర్, రామగుండం), రాజం (బెల్లంపల్లి, ఏఆర్‌ఎస్సై)లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులు మర్యాదపూర్వకంగా కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాను కలిశారు. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాంచందర్‌పై నవీన్ 5 ఓట్లతో గెలవడం విశేషం.

నవీన్‌కు నియామకపత్రం అందజేస్తున్న సీపీ

(c) eenadu